క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

కాటారం: మండలంలోని దామెరకుంటలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల పేరెంట్స్ కమిటీని ఆదివారం ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అల్లాడి లక్ష్మి రాజయ్య, గౌరవ అధ్యక్షుడిగా వేల్పుల నాగరాణి, ప్రధాన కార్యదర్శిగా సౌందర్య, ఉపాధ్యక్షురాలిగా శోభ, కోశాధికారిగా మల్లీశ్వరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శైలజ చరణ్, సలహాదారురాలిగా ఆకుదారి రాజేశ్వరీ, సభ్యులుగా కల్పన, ఉమ, మహేశ్వరీ, జయప్రద, అరుణ, భవాని, రజిత, స్వప్న నియమితులయ్యారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



చిట్యాల: మండలంలోని చల్లగరిగలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ చాలెంజర్ టీంకి ఫోరెన్సిక్ ల్యాబ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అజ్మీరా రాజునాయక్ అందించిన టీషర్టులను రాజునాయక్ కుటుంబ సభ్యులు బానోతు రుక్మాబాయి, చత్రునాయక్‌లు క్రీడాకారులకు ఆదివారం పంపిణీ చేశారు. అలాగే రూ.2000లను సైతం అందించారు. ఈ సందర్భంగా వారికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

రేగొండ : కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో కాటం సాంబయ్య, సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కొండ ధర్మయ్య ఇటీవల మృతి చెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఓంప్రకాష్, తిరుపతి, రాజయ్య, చందు, శివ, తదితరులు ఉన్నారు.

దాతల సాయం మరువలేనిది



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కన్నాయిగూడెం : ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా ఆదుకోవడం ఆనందంగా ఉందని ముప్పనపల్లి సహాయ నిధి గ్రూపు అధ్యక్షుడు అబ్బు సతీష్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన కోడె విశ్వనాథం మేకలను పెంచి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల మేకలతో వెళ్లి గట్టుపై నుంచి జారిపడడంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లగా డాక్టర్లు కాలికి ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఇందుకు రూ.లక్ష ఖర్చవుతుందని, దాతలు ఎవరైనా ఆదుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న సహాయనిధి గ్రూపు సభ్యుడు అబ్బు సతీష్ ఆ సమాచారాన్ని గ్రూప్‌లో పోస్టు చేశాడు. దీంతో దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరగా సాయం చేశారు. బాధితుడు కోడె విశ్వనాథానికి రూ.12వేల నగదును ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అందించారు. తిప్పనపల్లి విజయ్, రాజు అందించారు.

కారోబార్లపై కనికరమేది?

- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు
- కుటుంబాన్ని పోషించలేని దుస్థితి

మొగుళ్లపల్లి: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కారోబార్ల జీవితాలు దుర్భరంగా మారాయి. జిల్లాలో 248 గ్రామ పంచాయతీలు ఉండగా 163 మంది కారోబార్లు పనిచేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేక విధులు నిర్వహిస్తున్నారు. తమను నూతన ప్రభుత్వమైనా కనుకరించపోతుందా అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. నెలకు కేవలం రూ.9500 వేతనంతో పనిచేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో కార్యనిర్వాహక అధికారి నిర్వహించే పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. క్యాష్‌బుక్ రాయడం, ఇంటిపన్నులు, నల్లాపన్నులు వసులు చేయడం కొత్తగా నిర్మించే ఇళ్లకు అనుమతినివ్వడం, రికార్డులు రాయడం, పంచాయతీ సమావేశాల మినిట్స్ రాయడం, అజెండా తయారు చేయడం, సభ్యులకు చేరవేయడం లైసెన్స్ ఫీజులు తదితర అన్నిరకాల పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యక్షంగా పాల్గొని పథకాలు అమలు చేయడంలో, ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇన్ని రకాల పనులు చేస్తున్నా వారిని పట్టించుకున్నా నాథుడే కరువయ్యారు. కాగా, 2019లో అప్పటి ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పనిచేసే వాళ్లందరిని మల్టీపర్పస్ వర్కర్‌గా మారుస్తూ జీఓ తీసుకొచ్చింది.



మొట్లపల్లి గ్రామ పంచాయతీ భవనం

అమలుకు నోచుకోని కోర్టు తీర్పు..

పంచాయతీ రాజ్ చట్టం (జీఓ నం.557) ప్రకారం జనవరి 13, 1982 కంటే ముందు పదో తరగతి ఉత్తీర్ణులైన కారోబార్లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా ఉపాధి కల్పనా అధికారి సూచన మేరకు అర్హులైనా అభ్యర్థులను ఎంపిక చేసి కనీస వేతనం ఇవ్వాలనుకుంది. కానీ నేటికీ ఆ నిర్ణయాలు అమలు కావడం లేదు. కారోబార్లకు అనుకూలంగా ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపానపోలేదు. 2002లో పదేళ్ల సర్వీసు కలిగిన కారోబార్లందరికీ ఉద్యోగ ఉన్నతి కల్పించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ ఆ తీర్పు సైతం అమలుకు నోచుకోలేదు. దీంతో వారు 2007లో తిరిగి హైకోర్టును ఆశ్రయించగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అది కూడా బుట్టదాఖలైంది. పాతికేళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కరువైందని కారోబార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, అసిస్టెంట్లుగా ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కష్టమవుతోంది..



చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారుతోంది. అంతే కాకుండా పనిభారంతో ఇబ్బందిపడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– కుమారస్వామి, కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడు

పర్మనెంట్ చేయాలి



ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నా. కనీస వేతనం రాక పూట గడవని పరిస్థితి. కుటుంబపోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం తమను పర్మనెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలి.

– అబ్దుల్‌ముతిలిబ్, కారోబార్, మొగుళ్లపల్లి

బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రార్థనలు



అవగాహన కల్పిస్తున్న తిరుపతి

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి పట్టణంలోని పలు చర్చిల్లో బాల్యవివాహాలను వ్యతిరేకిస్తూ.. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సహాయ ఎన్జీఓ కోఆర్డినేటర్ శాస్త్రాల తిరుపతి తెలిపారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని బేతిస్త ప్రార్థన మందిరం పాస్టర్ రాజవీరు బాల్యవివాహాలను వ్యతిరేకిస్తూ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సహాయ ఎన్జీఓ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తిరుపతి మాట్లాడారు. భావి భారత నిర్మాణం కావాలంటే బాల్యవివాహాలను ఆపాలని అందుకు ప్రపంచ వ్యాప్తంగా 39 దేశాలు బాల్యవివాహాల నిర్మూలన కోసం సెప్టెంబర్ 13వ తేదీ నుంచి 14వ తేదీల్లో మత గురువులచే, హిందూ ఆలయ పురోహితులచే, ప్రధాన మజీద్‌లలో బాల్యవివాహాలు చేయబోమని చేయనివ్వమని ప్రతిజ్ఞలు చేయించడం జరుగుతుందన్నారు. బాల్యవివాహాలు చేసినట్లయితే, బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం శిక్షార్హులు అవుతారని తెలిపామన్నారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు, కాలనీ వాసులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్యాంబాబు

రేగొండ : ఎమ్మార్పీఎస్ ఆదేశాల మేరకు నేడు నిర్వహించనున్న తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యాంబాబు కోరారు. ఆదివారం మండలంలోని లింగాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, చేయూత పెన్షన్ దారులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజేందర్, సంతోష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న సమ్మిరెడ్డి

ములుగు రూరల్: పార్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఇంచర్ల పీఏసీఎస్ మాజీ చైర్మన్ వేముల సమ్మిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ములుగు మండలంలోని ఇంచర్ల, జంగాపల్లి, బంజరుపల్లి గ్రామాల పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న ఇంచర్ల పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు పార్టీ నిబంధనలు అతిక్రమిస్తూ, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయంలో అతడిని పార్టీ నుంచి అధిష్టాన నిర్ణయం మేరకు సస్పెండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగాపల్లి, ఇంచర్ల, బంజరుపల్లి, బరిగలానిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు జగన్నాథచారి, శ్రీనివాస్, కుమార్, రఘు, కునూరు అశోక్ గౌడ్, ముసినపల్లి కుమార్, శానబోయిన అశోక్, రాజిరెడ్డి, అనంద్, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వలస గిరిజనులతో అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ములుగు రూరల్ : వలస గిరిజనులతో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, కార్యదర్శి రవికాంత్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలసవచ్చిన గిరిజనుల వల్ల స్థానిక గిరిజనులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్ తెగలలో సామాజిక న్యాయం జరగాలంటే తెగల కమిషన్ ఏర్పాటు చేసి ఏ తెగ రిజర్వేషన్, విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఎంత అభివృద్ధి చెందిందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో వలస గిరిజనుల వలసలను అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్జ నారాయణ, నర్సయ్య, లక్ష్మీనారాయణ, నారాయణ, శ్రీనివాస్, శ్రీకాంత్, రామకృష్ణ, స్వామి, వినోద్‌కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కల్యాణి

ఎస్ఎస్‌తాడ్వాయి : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీనుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి తెలిపారు. ఆదివారం మండలంలోని కన్నెపల్లిలో కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఊరట్టం పంచాయతీ పరిధిలోని ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు గ్రామాలకు చెందిన మహిళలతోపాటు ఊరట్టం మాజీ వార్డు సభ్యుడు చర్పా వెంకటరమణ పార్టీలో చేరారు.వీరికి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కల్యాణి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారం జాతర అభివృద్ధికి మంత్రి సీతక్క చొరవతో ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. దసరా పండుగ తర్వాత అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. ఈ సమావేశంలో సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కొర్నెబెల్లి సావిత్రి ఉన్నారు.

ఏ ఎన్నిక ముందు?

- గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై జోరుగా చర్చ
- అయోమయంలో నాయకులు



ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు (ఫైల్)

రేగొండ: ఏ ఎన్నిక ముందు.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొస్తాయి? ప్రభుత్వం రోజుకో లీకుతో గ్రామ స్థాయిలో నాయకులు అయోమయంలో పడ్డారు. రేగొండలో 11 ఎంపీటీసీ స్థానాలకు గాను పురుషులు 16,597, మహిళలు 17,375, పోలింగ్ కేంద్రాలు 214, కొత్తపల్లిగోరి మండలంలో 6 ఎంపీటీసీ స్థానాలకు గాను పురుషులు 8,022, మహిళలు 8,424, పోలింగ్ కేంద్రాలు 128 ఉన్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఓటరు జాబితాను సైతం గ్రామాల్లో ఏర్పాటు చేసింది. కానీ ఏ ఎన్నికలు ముందు వస్తాయో ప్రభుత్వం తేల్చకపోవడంతో మండల, గ్రామ స్థాయి నాయకులు విస్తృతంగా చర్చలు జరుపుతున్నారు. ముందు ఏ ఎన్నిక వచ్చినా పోటీ చేయాలనే ఆలోచనలో నాయకులు ఉన్నారు. మరి కొందరు ఎంపీటీసీ వస్తే పోటీ చేద్దామని ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. ఇంకా రిజర్వేషన్లు ఖరారు కాలేదు. ఎప్పుడు ఏ ఎన్నిక పెడతారో తెలియక నాయకులు అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం ఏ ఎన్నిక నిర్వహిస్తుందో ఎదురు చూడాల్సిందే.

గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేయాలనే ఆశతో కొంత మంది నాయకులు ఎదురు చూస్తున్నారు. రిజర్వేషన్ కలిసి వస్తే తనకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ టికెట్ ఇవ్వాలంటూ గ్రామ, మండల స్థాయి నాయకులు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. పాత, కొత్త కాంగ్రెస్ నాయకులతో టికెట్ తమకేనంటూ గ్రామాల్లో మాత్రం రాజకీయ సందడి మొదలైంది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు రాకేశ్



సమావేశంలో మాట్లాడుతున్న జక్కు రాకేశ్

కాటారం: మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేలా ప్రతి కార్యకర్త ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్ అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జక్కు రాకేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తికాకముందే ప్రజల్లో ఎనలేని వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా కొనసాగుతున్న శ్రీధర్‌బాబు ఈ ప్రాంతానికి చేసింది శూన్యమన్నారు. నియోజకవర్గం కోసం చెప్పుకోదగ్గ ఒక అభివృద్ధి పని కానీ, పరిశ్రమ కానీ నెలకొల్పింది లేదన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారని రానున్న రోజుల్లో అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం పరితపించే పుట్ట మధు నాయకత్వాన్ని, బీఆర్ఎస్ పార్టీని గ్రామ గ్రామన బలపర్చడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాకేశ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, తోట జనార్దన్, బసాని రవి, బండం రాజమణి, కొండగ్లొ వెంకటస్వామి, జక్కు శ్రావణ్‌కుమార్, చిట్యాల సమ్మయ్య, టి.వి.రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేక ఆరోపణలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య



మాట్లాడుతున్న నర్సయ్య

రేగొండ: నియోజకవర్గంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మండల అధ్యక్షుడు నర్సయ్య విమర్శించారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం చెంచుపల్లి నుంచి చెన్నాపూర్ వరకు రూ.1.44 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ బీఆర్ఎస్ నాయకులు గత ప్రభుత్వ హయాంలోనే ఆ నిధులు మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లోనే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, పద్ధతి మార్చుకోకపోతే రాబోయే ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పున్నం రవి, బండారి దేవేందర్, వీరబ్రహ్మం, ప్రసంగి, వినోద్, రమేశ్, క్రాంతి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ నాయకుల మాటలు అర్థరహితం’

కాటారం: మహాముత్తారం మండలం నిమ్మగూడెం గ్రామ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న మాటలు అర్థరహితం అని మండల యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బౌతు రాజేందర్ అన్నారు. మహాముత్తారం మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమ్మగూడెం గ్రామ భూముల విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ అధికారంలో ఉందని అప్పుడు నిమ్మగూడెం గ్రామస్తులకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదో నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. కోట్ల రూపాయల సొమ్మును రైతుబంధు కింద దొరలకు అప్పజెప్పి 2018లో గ్రామ ప్రజలను ఇబ్బంది పెట్టి, అక్రమ కేసులు బనాయించిన వారు ఇప్పుడు నిమ్మగూడెం గ్రామస్తులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉండగా ప్రజల సమస్యలు పట్టించుకోని వారు ఇప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదకం అని విమర్శించారు.

ఫొటో ఎక్స్‌పోకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్స్

ఏటూరునాగారం : హైదరాబాద్‌లో ఈ నెల 19, 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పోకు అధిక సంఖ్యలో ఫొటోగ్రాఫర్లు తరలిరావాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫొటో స్టూడియో వద్ద తెలంగాణ ఫొటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాదె లింగమూర్తి ఆదేశాలతో పోస్టర్ ఆవిష్కరించామని అన్నారు. అసోసియేషన్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని నిర్వహిస్తున్న ఫొటో ఎక్స్‌పోకు ఏటూరునాగారం డివిజన్‌లోని ఏటూరునాగారం, మంగపేట, గోవిందరావుపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, నూగురు వెంకటాపురం మండలాల్లోని ఫొటో, వీడియో గ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ఫొటో ఎక్స్‌పో ప్రోగ్రాంను సందర్శించి నూతనంగా మార్కెట్లోకి వస్తున్న నూతన టెక్నాలజీలో మెళకువలతో పాటు వ్యాపార అభివృద్ధిలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మండల అధ్యక్షుడు చిదురాల వాసుదేవ్, లోటపెటల సర్వేశ్వరరావు, బోడ సారయ్య, బండి రమేష్, చిదురాల సాయికృష్ణ, మడిగల సురేష్, రవి, గుండ్లపల్లి కార్తీక్ ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

గోవిందరావుపేట : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ తెలిపారు. మండలంలోని పస్రా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ఖాళీ సీసాలు పగులగొడుతూ వికృత చేష్టలకు పాల్పడొద్దని హెచ్చించారు. రోడ్లపై వెళ్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేయొద్దని అన్నారు. రోజు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ ఉంటుందని, పెట్రోలింగ్ సమయంలో తాగి పట్టుబడిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ కనబడిన చట్టపరమైన చర్యలు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పశువులకు అందని వైద్యం

- మృత్యువాతపడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



మంగపేటలో మూసి ఉన్న పశువుల ఆస్పత్రి

మంగపేట: మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, రాజుపేట, నర్సింహాసాగర్ తదితర గ్రామాల్లో గేదెలు, గొర్రెలు, మేకల పెంపకంపై వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. దీంతో పాటు వ్యవసాయ కుటుంబాలు కావడంతో పశు సంపద ఎక్కువగా ఉంది. మండల కేంద్రంలోని పశు వైద్యశాలతో పాటు రాజుపేట, చుంచుపల్లిలోని ఆస్పత్రులో వైద్యాధికారి, సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో ఎప్పుడు చూసినా మూసి ఉంటున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పశువులు, జీవాలకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. మంగపేట రెగ్యులర్ పశువైద్యాధికారిగా, రాజుపేటకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న శ్రీకాంత్ జిల్లా కేంద్రంలోని డీవీఅండ్ ఏహెచ్ఓ కార్యాలయంలో రెండు నెలల నుంచి డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో మంగపేట, రాజుపేటలో పశువులకు వైద్యం అందడం లేదని ఆయా గ్రామాల పశు పోషకులు వాపోతున్నారు. చుంచుపల్లిలో సైతం ఆస్పత్రి మూసి ఉంటోందని తెలుపుతున్నారు. ఆస్పత్రికి వెళ్తే వైద్యాధికారి ఉండడం లేదని మందులు కూడా లేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

అర్హత లేకున్నా వైద్యసేవలు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ఎలాంటి అర్హత లేకున్నా పశువుల వైద్యులుగా చలామణి అవుతున్నారు. నిత్యం పశువులు, గొర్లు, మేకలు అనారోగ్యానికి గురవుతుండటంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో లేక పోవడంతో ప్రైవేటుగా వైద్యం చేస్తున్న వారిని ఆశ్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మండలంలోని పశువైద్య శాలల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి పశువులకు సకాలంలో వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో ఉండేలా చూస్తాం..

జిల్లా కార్యాలయంలో నోడలాఫీసర్ నర్సింహ ప్రమోషన్‌పై వెళ్లారు. ఆయన స్థానంలో టెక్నికల్ అధికారి అవసరం ఉండటంతో మంగపేట వైద్యాధికారిని తీసుకున్నాం. మండలంలో అని ఆస్పత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉండి పశువులకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– కొమురయ్య, వెటర్నరి జిల్లా అధికారి

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన సామగ్రి చూపుతున్న బాధితులు

వాజేడు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కొప్పుసూరు గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్ కథనం ప్రకారం.. కొప్పుసూరుకు చెందిన రొడ్డ మహేష్ ఇంట్లో బీరువా పై నుంచి విద్యుత్ వైర్ ఉంది. ఆ వైరును ఎలుకలు కొరకడంతో షార్ట్ సర్క్యూట్ అయి బీరువాలోని వస్తువులతో పాటు ఇంట్లోని గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అదే సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సుమారుగా రూ.50వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.